'ఆకలి' పుస్తకాన్ని ఆవిష్కరించిన 'కృష్ణదాస్'

విశాలాంధ్ర-నరసన్నపేట : ప్రముఖ కథల రచయిత, భమిటిపాటి గౌరీశంకర్ రచించిన కథల సంకలనం ఆకలి పేరిట ముద్రించిన పుస్తకాన్ని శనివారం వైసిపి జిల్లా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ నేటి మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వాస్తవ గాథలను 16కథలుగా మలిచి, గౌరీశంకర్ ఆకలి పుస్తకాన్ని రచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సి, దువ్వాడ శ్రీనివాస్, జెడ్పీ ఛైర్మన్, పిరియా విజయ, కళింగ వైశ్య, కాళింగ కుల కార్పోరేషన్ ఛైర్మన్లు, అంధవరపు సూరిబాబు, పేరాడ తిలక్, పిరియా సాయిరాజ్, రచయితల సంఘం అధ్యక్షులు, సదాశివుని కృష్ణ, ఆకలి పుస్తకం రచయిత, భమిడిపాటి గౌరీశంకర్, రచయితల సంఘం ప్రతినిధులు, ఎం.రామజోగేశ్వరశర్మ, జోస్యుల హరిప్రసాద్, సోమేశ్వరరావు, డి.విజయలక్ష్మి, పి.ప్రియంవద తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి దాతలు విరాళం

విశాలాంధ్ర-కవిటి : ఆలయాలు నిర్మాణానికి దాతలు విరాళంగా కొంత మొత్తం నగదును అందజేశారు. ఈ సందర్భంగా శనివారం జల్లుపుట్టుగ గ్రామానికి చెందిన దాత పూడి చందనం కవిటి లో నూతనంగా నిర్మాణ పనులు చేపడుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి 25 వేల రూపాయలు శ్రీ జగన్నాథ స్వామి దేవాలయం నిర్మాణానికి 5వేలు రూపాయలు నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొగిలిపురి సీతాలు, బచ్చు పాపయ్య రెడ్డి,చందాన పూర్ణ చంద్రుడు, తిరుపతి బెహరాతో పాటు పలువురు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు మనబడి సంస్థ నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి సంక్రాంతి పండుగ సందర్భంగా మనబడి వెల్ఫేర్ అసోసియేషన్, వల్లేవలస వారు గోవిందపురం, వడ్డీవాడ, నర్సాపురం పంచాయితీలలో గల నిరుపేద కుటుంబాలకు 15 రకాల నిత్యావసర సరుకులతో కూడిన కిట్‌లను శనివారం పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగరోజు పేద కుటుంబాలు సైతం ఆనందంగా జరుపుకోవాలని, అనే ఆశయంతో ఈ సరుకులు పంపిణీ చేసామని సంస్థ ప్రతినిధి ఉపాధ్యాయులు రెడ్డి సూరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గేదెల శివారెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మెండ రామినాయుడు, ఇప్పిలీ అప్పన్న, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీలు చించివేత

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 7వ వార్డు చినబాడాంలో కొంతమంది గుర్తు తెలియని అల్లరి ముఖాలు టీడీపీ ఫ్లెక్సీలను చించివేశారు. రాబోయే ప్రభుత్వంలో ఇచ్చే పథకాలను తెలియజేస్తూ బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అనే ఫ్లెక్సీ, నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసే ఫ్లెక్సీలు సైతం చించివేసి ఆనందం పొందారని కొంతమంది టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ టీడీపీ పట్టణాధ్యక్షులు బడ్డ నాగరాజు తీవ్రంగా ఖండించారు. ఇటువంటి చర్యలతో టీడీపీ విజయాన్ని అడ్డుకోలేరని హెచ్చరించారు.

మేళతాళాలతో రాముని అక్షంతలు ఊరేగింపు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కుసుంపురం గ్రామంలో మేళతాళాలతో రాముని స్పర్శ అక్షంతలు ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. అయోధ్యలో శ్రీ రాముని మందిరం ప్రతిష్ట సందర్భంగా కుసుంపురం గ్రామంలో అయోధ్య నుండి వచ్చిన శ్రీ రాముని అక్షింతలు స్థానిక సర్పంచ్ ఊర్మిళ శివ బిసాయి,ఎంపీటీసీ కర్రి పద్మ సత్యనారాయణ,మాతృమూర్తి యువజన సంగం ఆధ్వర్యంలో గడప గడపకు పంపిణి చేపట్టారు. ఈ సందర్భంగా జై శ్రీరామ్ శరణు ఘోషతో యువత ఉరిగింపుగా గ్రామంలో తిరిగి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో త్రిలోచన బిశాయి, మోహన్ దొళాయి, నాగు, సురేష్, చలపతి నిత్యానంద భక్త బృందం పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే అగ్రిగోల్డ్ బాదితులకు న్యాయం చేస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసనసభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం కోటబొమ్మాళి టిడిపి కార్యాలయంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ మరియు ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యాక్షులు ఎం.జయసింహ ఆద్వర్యంలో అగ్రిగోల్డ్ ఏజెంట్లు, సంఘ నాయకులు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలో ఉన్న 11 లక్షల అగ్రిగోల్డ్ బాదితులను ఆదుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనికి అయన వెంటనే స్పందించి అగ్రిగోల్డ్ బాదితులకు నష్టం జరిగిందని మాకు తెలుసునని, సైకో ముఖ్యమంత్రి జగన్ అగ్రిగోల్ బాదితులకు ఎన్నికలు ముందు పాదయాత్రలో ఆదుకుంటానని మాట ఇచ్చి వారి సమస్య పట్టించుకోలేదన్నారు. అయితే 2024లో టిడిపి అధికారంలోకి వస్తుందని అగ్రిగోల్డ్ బాదితున సమస్యను టిడిపి మ్యానిఫెస్టోలో పెట్టి అందరికి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అప్పటివరకు ఎవ్వరు అధైర్యపడవద్దుయని ఎలాంటి ఆత్మహత్యలు చేసుకోవద్దని అగ్రిగోల్డ్ ఏజెంట్లుకు, బాదితులకు కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ మరియు ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ మహిళ కార్యదర్శి అరెలమ్మ, జిల్లా కార్యదర్శి కె. శ్రీను, సభ్యులు గుడ్ల రవికుమార్, నారాయణరావు, అప్పలస్వామి, బి. మోహనరావు, ఇ. భాస్కరరావు, కె. రాజారావు, అగ్రిగోల్డ్ ఏజెంట్లు, బాదితులు పాల్గొన్నారు.

భవిష్య తరాలకు యువత రోలు మోడల్‌గా నిలవాలి

టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ క్వామేర్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : భవిష్యత్ తరాలకు యువత రోల్ మోడల్‌గా నిలువాలని టెక్కలి సబ్ కలెక్టర్ నురాల్ క్వమార్ అన్నారు. దండుగోపాలపురంలో గత మూడు రోజులుగా గంగరాపు రమేష్ కుమార్ మాస్టారు ద్వితీయ వర్ధంతి సందర్భంగా, జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు. శనివారం బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్లో మొత్తం 26 టీంలు తలపడగా, సెమీస్ రేసులో నరసన్నపేట, టెక్కలి గ్రౌండ్ టీం, సచిన్ స్పోర్ట్స్ క్లబ్ పూండి, టెక్కలి అంబేద్కర్ టీంలలో నరసన్నపేటపై టెక్కలి గ్రౌండ్ టీం విజయం సాధించింది.. టెక్కలి అంబెద్కర్ టీం పై సచిన్ స్పోర్ట్స్ క్లబ్ పూండి విజయం సాధించింది. ఫైనల్ రేసులో టెక్కలి గ్రౌండ్ టీం, పూండి సచిన్ స్పోర్ట్స్ తలపడగా సచిన్ స్పోర్ట్స్ క్లబ్ పూండి విజయం సాధించింది. ద్వితీయ స్థానంలో టెక్కలి గ్రౌండ్ టీం సాధించుకుంది. తృతీయ స్థానంలో టెక్కలి అంబేద్కర్ టీం సాధించుకుంది. ప్రథమ బహుమతి విలువ 10 వేల రూపాయలు, ఒక షీల్డ్. ద్వితీయ బహుమతి విలువ 7000 రూపాయలు, షీల్డ్. తృతీయ బహుమతి 5000, షీల్డ్ పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో సంతబొమ్మాలి మండల తహసిల్దార్ జె.చలమయ్య, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కోత మధుసూదన రావు, స్థానిక పూర్వ విద్యార్థులు, స్వర్గీయ గంగరాపు రమేష్ కుమార్ మాస్టర్ కుటుంబ సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

అంథుడిపై వైసీపీ సర్పంచ్ భర్త దాడి

విశాలాంధ్ర-పలాస: మండలం గరుడఖండి పంచాయతీ గోపాలపురం గ్రామానికి చెందిన దుర్గాభవానీ దేవాలయం పూజారి అంధుడైన కవిటి శ్రీనివాసరావుపై (ప్రభుత్వ ఉద్యోగి ఉపాధ్యాయుడు) గరుడఖండి వైసీపీ సర్పంచ్ భర్త బొత్స షన్ముఖరావు, అతని అనుచరుడు యవ్వారి కామేశ్వరరావు కలిసి దాడి చేసిన ఘటన ఈ నెల 10వ తేదీన చోటు చేసుకుంది. దీనిపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు పోలీసులు అందించిన వివరాల ప్రకారం వైసీపీ సర్పంచ్ భర్త, బొత్స షన్ముఖరావు పైపులైన్ వేయాలని చెప్పి దేవాలయం ప్రహరీగోడ కూల్చి వేయడంతో దేవాలయం గోడ కూల్చడం సరైన పద్ధతి కాదని అంధుడైన పూజారి కవిటి శ్రీనివాసరావు ఆయనను నిలదీయడంతో అంధుడని కూడా చూడకుండా ఆయనపై అడ్డు వచ్చిన తల్లి బానమ్మపై తన అనుచరుడుతో కలిసి విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితుడు అదే రాత్రి ముందుగా 100కు బాధితుడు పోన్ చేసి ఫిర్యాదు చేసి అనంతరం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు గాయాలతో పలాస ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. దీనిపై కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు చేసి 12వ తేదీన రాత్రి ఎఎస్‌ఐ బి.ఎస్.రావు వివిధ సెక్షన్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం : అడిషినల్ ఎస్పీ విఠలేశ్వరరావు

విశాలాంధ్ర-అరసవల్లి : సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని, ఆదర్శంగా నిలుస్తున్నారని అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో లయన్స్ అంతర్జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు,ఫౌండర్, ప్రెసిడెంట్ మెల్విన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈరోజు నగరంలో ని ఏడు రోడ్ల కూడలిలో ఉన్న వాల్ ఆఫ్ కైండ్నెస్ స్థలంలోలయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, వరం చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నూతన వస్త్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అడిషినల్ ఎస్పీ (క్రైం)టి. పి. విఠలేశ్వర రావు ప్రారంభించారు. అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ అందరికి భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు వస్త్ర పంపిణీ చెయ్యడం ఆనందంగా ఉందని,ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్,జోన్ చైర్ పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషన రావు, సెక్రటరీ రామ్ గోపాల్, ట్రెజరర్ శిల్లామణి, సభ్యులు జర్నలిస్ట్ కామేష్,ఉమాకవి, చరణ్ గుత్తు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ ఫలితాల్లో సత్తాచాటిన పవన్

విశాలాంధ్ర-సోంపేట : మండలం, పలాసపురం గ్రామానికి చెందిన నామాల పవన్ కుమార్ శనివారం విడుదల అయిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాల్లో ఆల్‌ఇండియా లెవెల్‌లో 65వ ర్యాంకు సాధించి సత్తా చాటుకున్నాడు. ఆంధ్రాయూనివర్సిటీలో ఎమ్మెస్సీ జూయా లజీ చదువుతున్న పవన్ 2023లో యూపీఎస్సీ విడుదల చేసిన మైనింగ్ విభాగంలో జూనియర్ జూవాలజిస్ట్ గ్రేడ్-ఎ పోస్టుకు దరఖాస్తు చేశాడు. అదే ఏడాది పరీక్షలు రాయగా శనివారం ఫలితాలు విడుదల అయ్యాయి. ఓపెన్ కెటగిరీలో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉండడంతో తల్లిదండ్రులు నామాల బాబూరావు, శ్రీదేవితోపాటు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అనేక మంది పవన్‌కు అభినందనలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా సోంపేటకు చెందిన శ్రీశయన చైతన్యదీపిక స్వచ్ఛంధ సంస్థ తరుపున అధ్యక్ష, కార్యదర్శులు దేవాడ మోహనరావు, దుద్ది వీర్రాజు అభినందనలు తెలిపారు.

సీబీసీఎన్‌సీ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - ఆమదాలవలస: ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్ ఆమదాలవలసలో 12, 13, 14 తేదీలలో నిర్వహిస్తున్న 69వ సీ బీ సీ ఎన్ సీ మహాసభ రెండవ రోజు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రసంగీకులు బిషప్ రెవరెండ్ డాక్టర్ డి.ఎస్.వి.ఎస్ కుమార్ దేవుని పనిలో నమ్మకముగా పనిచేయాలని తెలియజేశారు. అనంతరం 2024-29 5 సంవత్సరాల కాల పరిమితికి సీబీసీఎన్‌సీ నూతన కార్యవర్గాన్ని నామినేటింగ్ కమిటీ కన్వీనర్ జె. ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యుల సహకారంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కమిటీ మహాసభకు హాజరైన 52 బాప్టిస్ట్ సంఘాల రాయబారులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎన్నుకోబడిన నూతన కార్యవర్గం... అధ్యక్షులు పి జార్జ్ ఎబినేజర్, కార్యదర్శి కే కృపారావు, ట్రస్ట్ చైర్మన్ హెచ్ ఎస్ పాల్, ఉపాధ్యక్షులు ఆర్ సావిత్రి, రికార్డింగ్ సెక్రటరీ సిహెచ్ ప్రవీణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు వి అనిల్ దేవదత్ మరియు లోపింటి చిట్టిబాబు, ఈ కార్యవర్గం రానున్న 5 సంవత్సరములకు 2024-29 సీబీసీఎన్‌సీ కార్యవర్గం గా వారి విధులను నిర్వహించాలని దైవజనులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ కాపరి రెవరెండ్ వై అశోక్, రెవరెండ్ కే రామారావు, సంఘ కార్యవర్గం పాల్గొన్నారు.

చేయూతతో నలుగురికి సాయం

విశాలాంధ్ర-జలుమూరు: చేయూతతో నలుగురికి సహాయం అందించడం గొప్ప విషయమని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. శ్రీముఖలింగంలో వివేకానందుని జయంతిని పురస్కరించుకుని జలుమూరులో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. చేయూత గ్రూప్ సభ్యులు 36 మంది రక్తదానం చేశారు. సర్పంచ్ టి.సతీషకుమార్, ఎంపీటీస్ సభ్యుడు కె.హరిప్రసాద్, గ్రామ పెద్దలు బైర్ బలరామ్, తర్ర బలరామ్, రెడ్ క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య ఉన్నారు.

నిరుద్యోగుల సమస్యను పరిష్కరించడంలో జగన్ విఫలం

- మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి
- ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి
- ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ సమస్యల పరిష్కారం లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విఫలం చెందారని, నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస రావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రవిలు అన్నారు. అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని నిరుద్యోగులను నమ్మించి అధికారంలోకి వచ్చి మళ్లీ ఎన్నికలు వస్తున్న కూడా వైసీపీ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం కుడా ఇవ్వకపోగా డిగ్రీలు, పీజీ, డిప్లొమా చేసిన నిరుద్యోగులను లిక్కర్ మార్ట్, చికెన్ మార్ట్, మటన్ మార్ట్ లలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పడం నిరుద్యోగులను అవమానించడమే అవుతుందన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల పోస్టుల భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోనీ ఖాళీ పోస్టులు ఉన్నాయో రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నేను ఉన్నాను నేను విన్నాను అని చెప్పి అధికారంలోకి రాగానే ప్రభుత్వ శాఖల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తాను ప్రతి సంవత్సరం జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి నిరుద్యోగ, యువతరం ను మోసం చేశారని దుయ్య బట్టారు. జాబ్ క్యాలెండర్ పేపర్లకే పరిమతం అయ్యింది తప్ప ఆచరణలో ఏవిధమైనటువంటి ఉద్యోగాలు భర్తీ జరగలేదన్నారు. డీఎస్సీ విషయంలో నిరుద్యోగ యువతరం మోసం చేసారనిఅన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 50,667 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎస్జిటిలతో అదనపు తరగతులు నిర్వహిస్తూ డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నా రాన్నారు. జాతీయ విద్యా విధానం పేరుతో అనేక ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం లేదంటూ ప్రభుత్వం పెద్దలు, మంత్రులు వెల్లడించడం సరికాదన్నారు. నిరుద్యోగ యువత వేలాది రూపాయల ఖర్చు పెట్టుకుని డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తుందని డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యంగా విద్య,వైద్య, ఆర్థిక శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అరవింద్, రాజేష్, రవి, సత్యం, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అనాధ అక్కచెల్లెళ్లకు 'బిగ్ హెల్ప్' భారీ సాయం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మండలం నౌపడ గ్రామానికి చెందిన అనాథ అక్క చెల్లెళ్లకు బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం భారీ సహాయం చేశారు. నౌపడ గ్రామానికీ చెందిన కొంచాడ స్వాతి, పల్లవిలకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ మానవసేవలో భాగంగా అమెరికాకి చెందిన సతీష్, అనిత, చాంద్ ఫాషా ఆర్థిక సహకారంతో గత 4 సంవత్సరాలుగా చేస్తున్న సహాయం మాదిరిగానే, ఈ ఏడాది పిల్లలకు కొత్తబట్టలు 4 జతలు, నైట్ డ్రెస్సెస్ 4 జతలు, 3000 విలువ చేసే కాస్మొటిక్ వస్తువులు, 3000 విలువ చేసే స్టేషనరీ వస్తువులు, 2000, పాకెట్ మనీ, పరీక్ష ఫీజు, బాగ్స్, చెప్పల్స్, దుప్పటీలు, పచ్చదులు, హార్లిక్స్, డ్రై ఫ్రూట్, స్వీట్స్, బిస్కట్, మొత్తం, 23000 రూపాయిలు విలువైన వస్తువులను, బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టరు జయకృష్ణా రెడ్డి, చైర్మన్ సివి రాజా మాస్టర్ చేతులు మీదుగా అందించారు. బిగ్ హెల్ప్ ప్రతినిధులు ధనలక్ష్మి, సరోజినిలు సతీష్, అనిత, ఫాషా లకు ప్రత్యేక ధన్యవాదాలు పిల్లలు తెలియజేసారు. విద్యార్థులు చదివినంత కాలం సహాయం అందిస్తామని, భవిష్యత్‌లో నౌపడతోపాటు పరిసర పాఠశాలలకు సహాయం చేసే కార్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ తమిళనాడు

విజేతలకు బహుమతులందించిన మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-పలాస: పలాస జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గత నాలుగు రోజులుగా జరిగిన 47వ జాతీయ పురుషుల, మహిళల టెన్నికాయిట్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్‌గా తమిళనాడు జట్టు విజయం సాధించింది. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బహుమతులు అందజేశారు. అదేవిధంగా నిర్వాహకులకు అభినందించారు. ఈసందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి ఎంతో శ్రమతో పట్టుదలతో క్రీడాస్ఫూర్తిని నిలిచిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. తక్కువ స్థలంలో శారీరకంగా మానసికంగా దృఢత్వం అందించి అన్ని వయస్సుల వారి ఆడదగ్గ ఆట టెన్నికాయిట్ ఆటని, పలాసలో టెన్నికాయిట్ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పలాసలో 5కోట్ల రూపాయలతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నుంచి సముచిత లభించిందన్నారు. అలాగే పెంటిభద్ర చెరువు ఆధునీకరణ చేసి ప్రజలకు అంకితం చేస్తామని, చినబాడాం గ్రౌండ్‌లో ఓపెన్ ఆడిటోరియం నిర్మించడానికి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని అన్నారు.

విజేతలు వీరే.. : టీం చాంఫియన్ షిప్‌లో పురుషుల విభాగంలో కేరళ, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి జట్లు నిలిచాయి. మహిళల విభాగంలో తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, మహారాష్ట్ర జట్లు నిలిచాయి. సింగిల్స్ పురుషుల విభాగంలో ఎం.వైరముత్తు (తమిళనాడు), కమాలిక (పాండిచ్చేరి), ఎ.రమ్య (తమిళనాడు), ముత్తు అజంగి (పాండిచ్చేరి) విజేతలుగా నిలిచాయి. డబుల్స్ పురుషుల విభాగంలో ఎస్.అభిషేక్, డి.విల్సన్ (తమిళనాడు), పి.సంతోష్‌కుమార్, ఎం.జి. లక్ష్మణ్ (కేరళ), పి.జె.ఎం.డి రామారావు, వినయ్‌కుమార్ (ఆంధ్రప్రదేశ్), సునీల్ యశ్వంత కేధార్, పటమ మహేష్‌సంతోష్ (మహారాష్ట్ర)లు విజేతలుగా నిలిచారు. డబుల్స్ మహిళా విభాగంలో డి.దీక్షిత, ఎస్.పునీతప్రియ (తమిళనాడు), రెడ్డి మౌనిక, పతివాడ రేణుక (ఆంధ్రప్రదేశ్), భార్గవి, జయ్‌పవర్, రేణుక సమీరవయాహార్ (మహారాష్ట్ర)లు విజేతలుగా నిలిచారు. మిక్సిడ్ డబుల్స్ విభాగంలో బి.జయమిరిశాకన్నన్, ఎస్.మేనక (తమిళనాడు), చిత్రాడ తారకేశ్వరరావు, మల్లు ప్రవళిక (ఆంధ్రప్రదేశ్), జి.రంజిత్, ఎం.అంచిత (కేరళ), సురజ్‌ధుధాకుమార్, జోష్ ఫిసజిదలి సయ్యద్ (మహారాష్ట్ర)లు విజేతలుగా నిలిచారు. 24 పాయింట్లుతో ఓవరాల్ చాంఫియన్ షిప్‌గా తమిళనాడు నిలవగా 19 పాయింట్‌లో కేరళ, 08 పాయింట్లుతో పాండిచ్చేరి నిలిచింది. ఈ పోటీల్లో సురోజీత్ కర్మాకర్ (టెన్నికల్ కమిటీ చైర్మన్), డి.శంకర్ (టెక్నిక్ కమిటీ కన్వీనరు), పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు వై.డి.రామారావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.వి. సత్యన్నారాయణ, రాష్ట్ర కోశాధికారి పి.తవిటయ్య, రాష్ట్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ముఖ్య సలహాదారులు పి.సుందరరావు, జిల్లా ఒలింపిక్ సంఘ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎం.వి.రమణ, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, జిల్లాకు చెందిన పలువురు వ్యాయామ విద్య ఉపాధ్యాయలు, పలాస మున్సిపల్ వైస్‌చైర్మన్ మీసాల సురేష్‌బాబు, స్పోక్స్ పర్సన్ గుజ్జు జోగారావు, కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతివనం అపూర్వం

- రూ.400 కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ప్రభుత్వం
- వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-అరసవల్లి : విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ స్మృతివనాన్ని ఈ నెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రారంభిస్తారని వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం ఆయన విలేకరుల సమావేశంలో పార్టీ ఎస్సీ సెల్ విభాగా నేతలతో కలిసి మాట్లాడారు. 18.81 ఎకరాల స్థలంలో రూ.400 కోట్లతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అంబేద్కర్ స్మృతివనం, కాంస్య విగ్రహ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని చెప్పారు. అంబేద్కర్ విగ్రహం ఎత్తు 125 అడుగులు కాగా, పాదపీఠం ఎత్తు 85 అడుగులు అని, దీంతో మొత్తం విగ్రహం ఎత్తు 210 అడుగులు ఉంటుందన్నారు. ప్రపంచంలో ఇదే అత్యంత ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం అన్నారు. స్మృతివనంలోని అంబేద్కర్ ఎక్స్పీరియన్స్ సెంటర్, కన్వెన్షన్ సెంటర్, మినీ థియేటర్, ఫుడ్ కోర్టు, చిన్నారులకు ప్లే ఏరియా, గార్డెన్లు, మ్యూజిక్ ఫౌంటెయిన్, వాటర్ ఫౌంటెయిన్లు కూడా సీఎం జగన్ ప్రారంభిస్తారని వివరించారు. స్మృతివనం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర పండుగలా నిర్వహిస్తున్నా రన్నారు. ప్రపంచంలోనే అద్భుతమైన కళాఖండంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనాన్ని తీర్చిదిద్దారని, విజయవాడకే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచే అంబేద్కర్ విగ్రహ ప్రారంభ మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరవుతున్నా రని తెలిపారు. జిల్లా నుంచి హాజరయ్యేందుకు ప్రతినిధుల బృందానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసామని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్న ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమని అన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు పొన్నాడ రుషి, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, సుడ చైర్పర్సన్ కోరాడ ఆశాలతా గుప్తా, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పార్టీ నేతలు శిమ్మ రాజశేఖర్, ఎన్ని ధనుంజయరావు, రాజాపు అప్పన్న, కోరాడ చంద్రభూషణ్ గుప్తా, రౌతు శంకర్రావు, తంగుడు జోగారావు, బార్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి లేని వైసీపీని గద్దె దించాలి : మాజీ శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర-పోలాకి : నడుస్తున్న వైసిపి ప్రభుత్వంతో అభివృద్ధి లేదని నీతివంతమైన పాలన కోసం వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని నరసన్నపేట తెలుగుదేశం మాజీ శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. జయహెూ బీసీ గర్జన పేరిట శనివారం సాయంత్రం పోలాకి, జడూరు, గాతులవలస, వనవిష్ణుపురం, గుప్పడిపేట, అంపలాంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అంతా అక్రమ కేసులతో కాలయాపన చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో అనేకమంది తెలుగుదేశం పార్టీ నాయకులను హింసించి అక్రమ అరెస్టులు పేరుతో అనేక ఇబ్బందులకు గురిచేసినవిషయం గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ రా! కదలిరా!! అనే కార్యక్రమంతో ప్రజలతో మమేకమై ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. బీసీల హక్కుల సాధన కోసం తెలుగుదేశం పార్టీ తీవ్రంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్ల పేరుట వంచన చేసిందన్నారు. బీసీలపై కపట ప్రేమ చూపి నేడు వైసీపీ ప్రభుత్వం ద్రోహిగా మారిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో బీసీలకు 15 వేల కోట్ల రూపాయలుతో సబ్‌ప్లాన్‌తో న్యాయం చేశామన్నారు. సంక్రాంతితో సంతోషంగా తెలుగుదేశం పార్టీని స్వాగతించాలని ప్రజలను కోరారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మిరియపల్లి వెంకట అప్పలనాయుడు మాట్లాడుతూ మండలంలో గత తెలుగుదేశం పార్టీ పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిందని అన్నారు. 74 కోట్ల రూపాయలతో వనిత మండలం వంతెన నిర్మాణం 80 శాతం పనులు పూర్తి చేసిందని చెప్పారు. మిగతా 20 శాతం పనులు ఈ ప్రభుత్వం పనులు చేయలేక పోయిందని విమర్శించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు నందిపల్లి దండాసి మాట్లాడుతూ బీసీలకు జరిగిన అన్యాయం గడిచిన ఏ పార్టీలో కూడా లేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు ధర్మాన తేజ్ కుమార్ జనసేన మండల మహిళా అధ్యక్షురాలు వారధి వరలక్ష్మి లుకలాపు రాంబాబు న్యాయవాది ప్రగడ సూరిబాబు బగ్గు అర్చన దండు లక్ష్మీపురం మాజీ సర్పంచ్ డోల ప్రసాదరావు కోదూరు మాజీ సర్పంచ్ గొర్లె ఎర్రయ్య కరుకోల రమేష్ చిట్టీ సింహాచలం సురపు నారాయణ దాస్ నాని మైలపల్లి త్రినాధరావు మాజీ సర్పంచ్ ప్రగడ సూరిబాబు పలువురు మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలుగు కొత్త కేసులు నిర్ధారణ

విశాలాంధ్ర-జలుమూరు : ఎల్సీడీసీ -24 సర్వేకు సంబంధించి జలుమూరు మండలంలో ఇంత వరకు నాలుగు కొత్త కేసులు నిర్ధారణ చేయడం జరిగినదని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్ తెలిపారు. ఎల్సీడీసీ స్క్రీనింగ్ పరీక్షలలో భాగంగా గురువారం జలుమూరు మరియు అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పరీక్షలు నిర్వహించారు. డా.వంశీ కృష్ణ డా.సుజాత, సీహెచ్ఓ పద్మావతి, పర్య వేక్షకరాలు లలితాంబ, మెండ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయం

- టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

విశాలాంధ్ర -ఆమదాలవలస: రానున్న సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ పతనం దాదాపు ఖాయమైందని టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ విప్ కూన రవికుమార్ అన్నారు. శనివారం చీమలవలస గ్రామంలోని స్వర్గీయ సనపల రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. వైసిపి నాయకుల పిచ్చి పరాకాష్టకు చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమాన్ని విడనాడి దోపిడీ విధానాన్ని అవ లంబిస్తు న్నారని ఎద్దేవా చేశారు. అన్ని వ్యవస్థలను నాశనం చేశారని దీంతో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి దాటిందని విమర్శించారు. వరదాల కప్పుకొని ముఖ్యమంత్రి పర్యట నలు చేస్తున్నారని కనీసం జనాలను చూసేం దుకు కూడా ఇష్టపడని ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రదేశ్ కు దాపురించారని దీంతో ప్రజలు విసు గు చెంది ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీ ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. చంద్రబాబు రా కదలిరా పిలుపుమేరకు జనాలు ఉవ్వెత్తున తరలివస్తున్నా రని అది చూసి ఓర్వలేని వైసీపీ నాయకులకు వెన్నులో వణుకు పుట్టిందని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రం బాగుపడాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు ఆరాటపడుతున్నారని జోస్యం చెప్పారు. రానున్నది ప్రజా ప్రభుత్వ మని అందుకు ప్రజలు ఆదరించాలని కోరా రు. ఆయనతోపాటు సర్పంచ్ సనపల చెల్లం నాయుడు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో అంగన్వాడీ అక్కచెల్లెమ్మలకు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణలో కంటే అధనంగా వేతనాలు ఇస్తానని చెప్పిన హామీను అమలు చేయాలని అంగన్వాడీలు అన్నారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు చెల్లించాలని, రాష్ట్రంలో అంగన్‌వాడీలందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలుచేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు, వేతనంలో సంఘం పింఛన్ ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్‌కు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేసి అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, భీమా అమలు చేయాలని తదితర డిమాండ్‌లును ప్రభుత్వం చెల్లించాలని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, గొంది నీలన్న, దుంపల సుధర్శన, అంగన్వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేరాడ తిలక్‌ను సత్కరించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైస్సార్సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా పేరాడ తిలక్‌ను నియమించడం తో తిలక్ శనివారం పాతపట్నం నియోజక వర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతిని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పాతపట్నంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి నియోజకవర్గ నాయకుల తో పార్లమెంట్ ఇన్‌చార్జ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతిని పార్లమెంట్ ఇన్ చార్జ్ పేరాడ తిలక్ శాలువా తో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి, శ్రీకాకుళం పార్లమెంట్ వైస్సార్సీపీ అభ్యర్థి పేరాడ తిలక్‌లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు సీఎం జగన్ మోహన్ రెడ్డి వల్లే సాధ్యమని మన రాష్ట్ర ప్రజలందరూ మళ్ళీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే నిర్ణయించుకున్నారని శ్రీకాకుళం జిల్లాలో 8 అసెంబ్లీ సీట్లు, శ్రీకాకుళం ఎంపీ సీటును వైస్సార్సీపీ భారీ మెజారిటీ తో గెలుస్తామని విలేకరులకు ఈ సందర్భంగా తెలియజేశారు. హామీలు ఇచ్చినవి ఇవ్వనివి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ సీఎంను చేయడం జరుగుతుందని కొనియాడారు. ఈసందర్భంగా జిల్లా ఓటరు మహాశయులకు సంక్రాతి శుభాకాంక్షలు అందజేశారు. వైస్సార్సీపీ నాయకులు సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ ఆశయసాధనకు సీఎం జగన్ కృషి

విశాలాంధ్ర-హిరమండలం : భారత రాజ్యాంగ నిర్మాత డా. బి ఆర్ అంబేద్కర్ ఆశయసాధన కు రాష్ట్ర ముఖ్య మంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి శక్తివంచన లేకుండా కృషి చేస్తూ బడుగు బలహీన వర్గాల రాష్ట్ర ప్రజలకు సీఎం మేలు చేకూర్చే విధంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని జెసిఎస్ మండల కన్వీనర్ అంద వరం వెంకట్ సురేష్, మండల వైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ లు అన్నారు. శనివారం హిరమండలం 3 సచివాలయంలో బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైస్సార్సీపీ శ్రేణులు నాయకులతో సంతకాలు సేకరించి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మండల వైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు ఎవి సురేష్ లు మాట్లాడుతూ ఈనెల 19వ తేదిన విజయవాడలో 404 కోట్ల రూపాయలుతో 150 అడుగుల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహంను సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆవిష్కరణ చేయనున్నారని తెలియ జేశారు. బడుగు బలహీన వర్గాల దేశ ప్రజలకు అంబేద్కర్ ఎన్నో సేవలు అంద జేశారని అంబేద్కర్ మహోన్నత మైన, ఆదర్శనీయమైన వ్యక్తి, శక్తి అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పి.అప్పలరెడ్డి, రమణ, జి సురేష్, మీసాల శంకర్, నక్క ఆనంద్, జోగి శ్రీనివాస్, టీ తవుడు, గ్రామ వాలంటీర్లు తదితరులు ఉన్నారు.

అచ్చెన్న సమక్షంలో తెదేపా తీర్థం పుచ్చుకున్న వైకాపా నాయకులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మండలం తాళ్ళవలస పంచాయితీకి చెందిన పలువురు వైకాపా నాయకులు కార్యకర్తలు శనివారం తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, టెక్కలి శాసనసభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో సంతబొమ్మాళి మండలం తాళ్లవలస గ్రామం నుండి మార్పు మన్మధరావు, మార్పు సూర్యనారాయణ, గున్న మల్లేష్, బెందాళం కృష్ణప్రగడ నారాయణ, చమళ్ళ రాములు, గున్న పాపారావు, వల్లభ అప్పారావు, దాసరి రమణమూర్తి, గున్న రాము, మార్పు రామారావు, మార్పు రమణయ్య, దాసరి కృష్ణమూర్తి వైకాపా నుండి తెదేపాలో చేరారు. పార్టీలో చేరిన వారికీ తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాలు అభివృద్ధి అచ్చెన్నతోనే సాధ్యమని వైకాపా పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని వారు పేర్కొన్నారు.

కాశీబుగ్గ సిఐగా విజయానంద్

విశాలాంధ్ర-పలాస : కాశీబుగ్గ పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సి.ఐ)గా ఎన్.విజయానంద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మర్యాదపూర్వకంగా డిఎస్‌పి నాగేశ్వరరెడ్డిని కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇటీవల విశాఖ రేంజ్‌లో పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీ చేస్తూ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ పోలీసులు విశాఖ రేంజ్ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఇక్కడ పని చేసిన సి.ఐ నవీన్‌కుమార్‌కు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు బదిలీ చేయగా విజయనగరం టూ టౌన్ సి.ఐ పని చేస్తున్న విజయానంద్‌ను కాశీబుగ్గలో నియమించారు. బాధ్యతలు చేపట్టిన విజయానంద్‌కు సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అయోధ్య రామ అక్షంతలు పంపిణీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి... మండలం రుంకుహనుమంతపురం గ్రామంలో స్థానిక భక్తులు లోళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అయోధ్యరామ పాద స్పర్శ అక్షతలు లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయోధ్య రాముని ప్రాధాన్యతను తెలియ జేశారు. భక్తులందరూ ఇంటింటికి వెళ్లి అక్షతలను పంపిణీ చేసి ఆయా కుటుంబీకుల్లో భక్తి పారవశ్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ గణపతిరావు, లబ్బ సన్యాసిరావుతో పాటు పలువురు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా గాజాకు సంఘీభావం ప్రకటిద్దాం... యుద్ధాన్ని వ్యతిరేకిద్దాం

- జనసాహితి - ఏపీటీఎఫ్ పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: మూడు నెలలకుపైగా, గాజాపై ఇజ్రేల్ చేస్తున్న అమానవీయమైన బాంబు దాడుల నేపథ్యంలో ఈ సంఘీభావాన్ని ప్రపంచవ్యాప్తంగా 13 జనవరిన తెలియచేస్తున్నామని, జనసాహితీ ఏపీటీఎఫ్ సభ్యులు స్థానిక పిఎస్ఎన్ ఎంఎల్ పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో తెలిపారు. గాజాపై ఇజ్రేల్ చేస్తున్న దాడి అమానుషమైనదని, గత శతాబ్దంలో జరిగిన యుద్ధ విధ్వంసాన్ని ఈ దాడులు గుర్తు చేస్తున్నాయని, రోజుకు 300 మందిని చంపుతూ ఇప్పటికి 30 వేల బాంబులను ఇజ్రేల్, గాజా పౌరులపై ప్రయోగించిందని, ఫలితంగా గాజాలోని ఇళ్ళు 70 శాతం వరకు పూర్తిగానో, పరోక్షంగానో నేలమట్టమైపోయాయన్నారు. 21 వేలమందికి పైగా సాధారణ ప్రజలు, అందులో అత్యధికంగా పిల్లలు చనిపోయారు. గాజా నగర విధ్వంసాన్ని, బోస్టన్, హెల్సింకీ, రాటర్డాం, లీడ్స్ నగరాలను విధ్వంసం చేసినంతగా పోల్చవచ్చును. యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ జనసాహితీ ఏపీటీఎఫ్ సంయుక్తంగా ఈరోజు శ్రీకాకుళం నగరంలోని పిఎస్ఎన్ఎం హైస్కూల్లో సమావేశమయ్యామన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రకటన ప్రకారం గాజాలో సగం మంది ప్రజలు ఆకలితో అల్లల్లాడుతున్నారు. మందులు, వైద్యం లభించక బాంబుదాడులలో చనిపోయినవారికన్నా ఎక్కువమంది మరణిస్తున్నారని, మనందరం సంఘీభావంగా గాజా ప్రజలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చావలి శ్రీనివాస్, సదాశివుని శంకరరావు, ప్రజాసాహితి నాగరాజు, పి నాగభూషణరావు, ఎం అశోక్, టీ జోగారావు చింతాడ తిరుమలరావు, సిహెచ్ త్రినాధరావు, పి వంశీ కృష్ణ, కె.వి గురు ప్రసాద్, బి మహేశ్వర రావు, టీ ఎర్రమ్మ, కె మురళీధరరావు, బి కాసీలు, కె హిమబిందు మొదలవారి పాల్గొన్నారు.

శ్రీ జ్ఞానజ్యోతి ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక మారుతీనగర్-2వ వీధిలో వున్న శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్‌లో శనివారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా స్కూల్ ఉపాధ్యాయులు, చంచల ఆదినారాయణ మాట్లాడుతూ స్వామి వివేకానంద యొక్క విశిష్ఠతను విధ్యార్ధులకు వివరించారు. అనంతరం విధ్యార్ధులు స్ధానిక స్కూల్ నుండి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానజ్యోతి స్కూల్ మేనేజ్‌మెంట్, బోర రామారావు, వెలమల భాస్కరరావు, తర్ర సత్యన్నారాయణ, పాగోటి లక్ష్మీ, స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది, విధ్యార్ధులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు అందరికీ శ్రీరామరక్ష

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : అయోధ్యలో భవ్యమైన రామమందిర ప్రాణ ప్రతిష్ట సందర్భంగా విశ్వవ్యాప్తంగా జనవరి 1 నుంచి జనవరి 15వరకు జరిగే శ్రీరామ పూజిత అక్షింతల వితరణలో భాగంగా మండలం గుంటజగన్నాధపురం గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ప్రజలకు అయోధ్య బాలరాముని అక్షింతలను కోటబొమ్మాళి మండల విద్యాశాఖాధికారి ఎల్‌వి. ప్రతాప్, శ్రీరామభక్తులు సనపల కరుణ్‌కుమార్ తదితరులు అందించారు. ఈ అక్షింతలను 22వ తేదీ వరకు ఇంట్లో దేవుని మందిరంలో పెట్టి ఆ రోజున దేవుని వద్ద మూడు, గుమ్మం ముందు రెండు దీపాలను వెలిగించి పెళ్లి కాని వారికి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ అక్షింతలు వారిపై చల్లడం ద్వారా వారికి అంతా మంచి జరుగుతుందని, అందరూ శ్రీరాముని కృపాకటాక్షాలకు పాత్రులవ్వగలరని వారు పిలుపు నిచ్చారు.

ట్యూషన్ విద్యార్థులకు ఇన్వర్టర్ వితరణ

విశాలాంధ్ర-కవిటీ : మండలంలోని బొరివంక ఒరియా వీధి విద్యార్థుల ట్యూషన్ సెంటర్‌కు విశ్రాంత డిఎస్‌పి ఎస్‌వివి ప్రసాద్‌రావు ఇన్వర్టర్ కోసం పదివేల రూపాయలు నగదును వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా విశ్రాంత డిఎస్‌పి, ఎస్‌వివి ప్రసాద్‌రావుకు బొరివంక గ్రామస్తులు శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం విశ్రాంత డిఎస్‌పి, ఎస్‌వివి ప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని అన్నారు.విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు మార్గాన్ని నిర్దేశించుకుని లక్ష్యాన్ని చేరుకునే దిశగా అడుగులు వేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాం ప్రసాద్, ఉపాధ్యాయులు బల్లేడ లక్ష్మణమూర్తి, విజయ్ కృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

విశాలాంధ్ర-మందస : మండలం బాహాడపల్లి గ్రామానికి చెందిన సాలిన వరలక్ష్మీ, ఎం.కిష్టమ్మ, పులారి రాఘవులు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు. శివాజీ వెంట బావన దుర్యోదన, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, ఎం.నవీన్, సాలిన పెద్దవెంకయ్య, సార సోమేశ్వరరావు, సాలిన జానికిరావులు ఉన్నారు.

ఘనంగా శ్రీగోదా రంగనాథ స్వామి వారి నిశ్చితార్థం

విశాలాంధ్ర-కవిటీ: మండల కేంద్రమైన కవిటి పట్టాభిరామ ఆలయంలో శ్రీ గోదా రంగనాథ స్వామి వారి నిశ్చితార్థం ఆలయ అర్చకులు యోగానంద స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువ జామున స్వామివారికి విశేష పూజలు చేపట్టారు. అనంతరం అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని శ్రీ గోదా రంగనాథ స్వామి చిత్రపటాలతో గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అభినవ అంబేద్కర్ జగన్‌మోహన్‌రెడ్డి

- అంబేద్కర్ ఆశయాలే ఊపిరిగా.. సమసమాజ స్థాపనే లక్ష్యంగా పాలన
- కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: సమాజంలో సమానత్వం కోసం పోరాడిన యోధుడు డా. బాబా సాహెబ్ భీంరావ్ రాంజీ అంబేద్కర్ అని, నాటి ఆయన పోరాటమే సమసమాజ స్థాపనకు అడుగులు వేసిందని, ఆయన బాటలోనే పయనిస్తూ అభినవ అంబేద్కర్‌గా ప్రజలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అభినందనలు అందు కుంటున్నారని కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. నగరంలోని వైఎస్ ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశ చరిత్రను చూస్తే కొంతమంది నాయకులు మాత్రమే అంబేద్కర్ వారసుల్లా, ఆయన ఆశయ సాధనకు కృషి చేసిన వారు కనిపిస్తారని చెప్పారు. అందులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి దివంగత డా. వైయస్సార్, ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్ ముందు వరుసలో నిలుస్తారని రాజకీయాలకతీతంగా ఎంతోమంది చెబుతుంటా రని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తోందని చెప్పారు. మరోపక్క సాధారణ ప్రజానీకానికి అన్నిరకాల సంక్షేమ పథకాలు అందించడంతో పాటు కేబినెట్‌లోని 68 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కేటాయించి ఔరా అనిపించారని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివద్ధికి డీబీటీ ద్వారా రూ. 2.68లక్షల కోట్లు అందించారని తెలిపారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ చట్టసభల్లో, స్థానిక సంస్థల పదవుల్లో, నామినేషన్లపై ఇచ్చే పనుల్లో కూడా ఆవర్గాలకు 50 శాతం కేటాయించా లని నిర్దేశించారు. మొత్తానికి వెనుకబడిన పేద వర్గ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి వారి అభ్యున్నతికి పాటుపడిన వారిలో సీఎం జగన్ ముందు వరుసలో ఉంటారని కొనియాడారు. రాష్ట్రంలో 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి 56 చైర్మన్లను, 672 డైరక్టర్లను నియమించిన గొప్ప మానవతావాది జగన్‌మోహనరెడ్డి అన్నారు. జనవరి 19న విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమానికి అంబేద్కర్ ఆశయ సాధకులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని అంధవరపు సూరిబాబు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్నాల శ్రీనివాసరావు, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత గుప్త, చంద్ర భూషణ్ గుప్తా, గుర్ల దామోదర్, కళింగ కోమటి సంఘ జిల్లా అధ్యక్షులు తంగుడు జోగారావు, వైఎస్ఆర్‌సిపి యువజన విభాగం నగర అధ్యక్షులు బరాటం సంతోష్, ఏవి రమేష్ తదితరులు ఉన్నారు.

సర్వమత సంగమేశ్వరం... 15 నుండి జాతర

విశాలాంధ్ర-ఆమదాలవలస : సర్వమత సంగమేశ్వర కొండ దేవాలయం వద్ద మూడు రోజులపాటు అంగ రంగ వైభవంగా జాతర జరగనుంది. బౌద్ధ, శివ (శైవ), జైనమత ఆనవాళ్లను ఈ కొండమీద కనుగొన్నారు. దశాబ్దాల కాలంగా సంగమేశ్వర కొండగా పిలువబడే కొండపై భాగాన పాండవులు సంచరించి నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఎక్కడకు దగ్గరలో ఉన్న పాండవుల మెట్ట వద్ద అజ్ఞాతవాస సమయంలో నివాసం ఉన్నట్లు కొన్ని ఆధారాలు వెలుగు చూసాయి. బౌద్ధ మతానికి ప్రతీకగా ఆలయం ముందు బాగాన బుద్ధుని విగ్రహం, వెనుక భాగాన బాహుబలి విగ్రహం మధ్యలో శివలింగం ఉన్నాయి. పాండవుల వంశధార నదిలో స్నానమాడి ఈ ఆలయంలోనే పూజలు చేసేవారని కూరవస్తేనీ పనులు వెల్లడించారు. ఇంతటి ప్రాచుర్యం పొందిన మూడు మతాల సంగమేశ్వరుని కొండవద్ద సంక్రాంతి రోజు నుంచి మూడు రోజులపాటు జాతర నిర్వహిస్తారు.

- రేవటి నుంచి సంగమేశుని జాతర... సంగమేశ్వరుని ఆలయం వద్ద సంక్రాంతి నుంచి కనుమ ముక్కనుము మూడు రోజులపాటు 14 మండలాలకు చెందిన భక్తులు వచ్చి సంగమేశ్వని దర్శించుకుంటారు. 150 మెట్లు ఎక్కి కొండ గుహలో ఉన్న సంగమేశ్వరుని భక్తులు దర్శించుకుంటారు. ఈ సందర్భంగా ఇక్కడ పెద్ద ఎత్తున జాతర జరుగుతుంది. పురావస్తు శాఖ అధికారి తెనాలి వెంకటేశ్వరరావు 1999లో ఒక నివేదికను అందించారు. ఆ నివేదిక ఆధారంగా అక్కడ నిక్షిప్తమైన అంశాలతో చరిత్రలోని కొన్ని ఘటనలు ముడిపడి ఉన్నాయని దీనిని అభివృద్ధి చేయాల్సి ఉందని ప్రభుత్వం నిర్దేశించింది. ఇక్కడ జరిగే జాతరకు ఆకతాయి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చేయకుండా

నివారించేందుకు ఆముదాలవలస పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే యాత్రకు వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండా ఉండేందుకు ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. చిన్నారులకు తర్వాత వాతావరణం అందించే ఆటలు, రంగులరాట్నం వంటి ఆటలు ఆడేందుకు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో తమ్మినేని సీతారాం పర్యాటక మంత్రిగా ఉన్నప్పుడు ఆ శాఖ ద్వారా అభివృద్ధి చేసేందుకు శిలా ఫలకాలు వేశారు. నిధులు మంజూరు కాకపోవడంతో పనులు జరగలేదు. ఇంతటి ప్రాచుర్యం సంతరించుకున్న ఈ ఆలయ అభివృద్ధికి పర్యాటక రంగం కృషి చేయాల్సి ఉంది.

బీసీలకు అన్యాయం చేస్తున్న వైసిపి... మాజీ ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర-జలుమూరు: జయహో బీసీ పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బీసీ ముఖ్య నాయకులతో జలుమూరు, మండలం అల్లాడ, తిమడాంలో పర్యటించారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాలను ప్రజలకు వివరించారు. బీసీలపై వైసీపీ ప్రభుత్వం చేసిన దాడులను ఖండిస్తూ రూపొందించిన పుస్తకంను ఆవిష్కరించారు. బీసీలు శ్రమ జీవులని బీసీలకు టిడిపి అండగా ఉంటుందని అన్నారు. టిడిపి ప్రభుత్వహయాంలో బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇచ్చామన్నారు.

హెచ్‌ఆర్‌ఎం జిల్లా కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర-పలాస : హ్యూమన్ రైట్స్ మిషన్ (ఎచ్ఆర్ఎం) జిల్లా శాఖ ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం జిల్లా శాఖకు పలాస నియోజక వర్గానికి చెందిన ఈశ్వర్ పాత్రో (జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ)గా, మల్లేన దేవరాజు (జిల్లా వెల్ఫేర్ సెక్రటరీ)గా నియమించారు. వీరికి హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్‌నాయిక్, కాశీబుగ్గ డిఎస్‌పి జి.నాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా 2024-25 రెండేళ్లపాటు వీరి పదవీకాలం కొనసాగుతుందని కుమార్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర అధ్యక్షులు సైక్ బాషా, జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.జి.కుమార్, జానపద గాయకులు ఎన్.వాసులు పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర-కవిటీ: మండలం లోని రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995-2000 విద్యా సంవత్సరములలో 6 నుండి10వ తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అలనాటి ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్వపు విద్యార్థులు ఉపాధ్యాయులు అలనాటి మధుర జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాయల్ డాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : రాయల్ డాన్స్ క్లబ్ ఫౌండర్ పి యోగేంద్ర, స్టార్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి బి.దేవిప్రసాద్ పాల్గొని సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ముందుగా రంగురంగుల పతంగులను ఎగురవేశారు. సేంద్రియ వ్యవసాయ రైతులు ఏర్పాటు చేసిన కూరగాయలు,

పప్పుదినుసులు, వరికంకిలు, పువ్వులతో కలిపిన స్వాగత ముగ్గులను మరియు మహిళలు, చిన్నారులు వేసిన రంగుల ముగ్గులను తిలకించారు. అనంతరం భోగి మంటలను వెలిగించి, మహిళలతో కలిసి భోగి మంటల చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. చిన్నారుల ప్రత్యేక వేషధారణ, కోలాటం, సంక్రాంతి పాటలకు నృత్యాలు, హరిదాసు గీతాలు, వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగల విశిష్టతను తెలియజేస్తూ, ప్రజలందరి జీవితాల్లో బోగభాగ్యాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డాన్స్ కొరియోగ్రాఫర్స్ జుంబ ట్రైనర్ రాంబాబు, హరీష్, భాను ప్రకాష్, రామకృష్ణ, డాక్టర్ రాంబాబు, జ్యోతి, నాని, బివిఎస్ సత్యనారాయణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సుప్రియ రాజకీయ నిర్ణయంపై ఇంటెలెజెన్స్ ఆరా!

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం మాతల గ్రామ సర్పంచ్ కలమట సుప్రియ రానున్న ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గం నుండి వైసీపీ టిక్కెట్ ఆశిస్తున్నారు. అన్న వార్తలు వివిధ పత్రికల్లో శనివారం రావడంతో ప్రభుత్వ నిఘా విభాగాం (ఇంటెల్జెన్స్) అధికారులు స్పందించారు సర్పంచ్ సుప్రియ భర్త కలమట రమేష్ బాబుతో ఫోన్‌లో మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం మీడియాలో వచ్చిన సమాచారం నిజ ని ఆయన ఇంటెల్జెన్స్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి సర్పంచ్ కలమట సుప్రియ రాజకీయ, నేపథ్యం వివరాలను ఇంటెల్జెన్స్ అధికారులు సేకరించినట్లు తెలిసింది.

పేద కుటుంబాలకు సరుకుల పంపిణీ

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో 23 మంది తెలగ పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులతో పాటు దుస్తులు, నగదును రాజరాజేశ్వరి దేవి తెలగ సంఘం అధ్యక్షులు శీలం రూపసుందర్, కార్యదర్శి వాసు, కోశాధికారి అప్పారావులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు, దుస్తులు, నగదు తమ సంఘం పెద్దలు, యువకులు ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే సంఘం బలోపేతానికి సంఘ సభ్యులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బల్ల శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సీపీఎం సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : అంగన్వాడీల పోరాటానికి సిపిఎం పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు తెలిపారు. శనివారం శ్రీకాకుళంలో జ్యోతిభాపూలే పార్కు వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె సమంజసమైనదని, గత నాలుగు సంవత్సరాలు అనేక రకాలుగా ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో చట్టబద్ధంగా సమ్మె చేపట్టారని తెలిపారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచకపోతే ఎలా బ్రతకాలని అని ప్రశ్నించారు. అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ జీఓ ఇవ్వడం, నోటీసులు ఇస్తూ బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు. అంగన్వాడీలకు ఎస్మా వర్తించదని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సి. హెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి మాట్లాడుతూ పండుగ తర్వాత అంగన్వాడీల పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, ఎస్మా జీఓ కాపీలను భోగి మంటలలో దగ్ధం చేస్తామని, ఆమరణ నిరాహారదీక్షలు చేపడుతామని తెలిపారు. ప్రజలలోకి వెళ్ళి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వివరిస్తామని, కోటి సంతకాలు సేకరణ చేపడతామని తెలిపారు. అంగన్వాడీలు గత 33 రోజులుగా సమ్మె పోరాటం చేస్తున్నా ముఖ్యమంత్రి అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు, మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేసారు. అంగన్వాడీలకు గ్రాట్యూటీ చట్టాన్ని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేసారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచుతామన్న ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ ఇవ్వాలని డిమాండ్ చేసారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య నిమ్మరసం ఇచ్చి 24 గంటల నిరాహారదీక్షలు విరమించారు. సిఐటియు నాయుకులు ఆర్.ప్రకాష్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'చంద్రబాబు పాలనలోనే అభివృద్ధి'

విశాలాంధ్ర-జలుమూరు: చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రంలోను, గ్రామాల్లోను సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, సాగు, తాగు నీటితో పాటు పలు అభివృద్ధి పనులు చేసుకున్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలమట సాగర్ తెలిపారు. జై హెూ బీసి కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం జలుమూరు మండలంలో పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుని మరోసారి గెలిపించాలని అన్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు.